# నేను ఎందుకు రాశాను? (కథకాని కథ)

1930 దశకం మొదటి సంవత్సరాలు. నవర్సు బంగారం ధర పదమూడు రూపాయలు. బస్తా బర్మా బియ్యం ధర రెండున్నర రూపాయలు. నెల పొడుగునా సమృద్ధిగా సరిపోగల నెయ్యికి కేవలం రూపాయి వెచ్చిస్తే చాలు. పూటకూళ్ళింట్లో పావలాకు సుష్టయిన భోజనం. గోల్డెన్ కేఫ్‌లో రెండణాలకే నేతి పెసరట్టు, తోడు ఉప్మా అరకప్పు చిక్కని కాఫీ. వల్లమూడి నారింజ కాయలు అర్ధ రూపాయకే బుట్టనిండేవి. స్వర్ణశకం అనుకోగలరు. ఆ అర్ధ రూపాయి లభించటమే దుర్లభకార్యం. ప్రపంచమంతా ఆర్థిక మాంద్యం అలముకొన్న రోజులవి. వ్యవసాయ రంగంలో గాని, పారిశ్రామిక పరిధిలో గాని ఒక్క అభివృద్ధి కార్యక్రమమూ మృగ్యం. కానిదల్లా తాలూకా బోర్డు, జిల్లా బోర్డు మునిసిపాలిటీ రాజకీయాలు. జస్టిస్ పార్టీ ధ్వజం జిల్లాలో అన్ని ప్రాంతాల్లోను కన్పించే రోజులు. దేశ రాజకీయ రంగమా - రెండవ రౌండు టేబిల్ విఫలమై మహాత్మాగాంధీ స్వదేశం చేరుకున్నారు. చేరుకొన్న వారం రోజుల్లోనే ఎరవాడ జైల్లో నిర్బంధం.

అంతకు ముందు జరిగిన ఉప్పు సత్యాగ్రహ మహోద్యమంలో జైలు శిక్ష అనుభవించి వచ్చిన పిన్ని - రెండు మూడు రాట్నాలు కూర్చి, అమ్మకు ఖద్దరు దారం వడకటం నేర్పుతున్న దినాలు. పాత "యంగ్ ఇండియా" పత్రికలో గాంధీజీ వ్యాసాలు చదివి, ఇంటికొచ్చిన వారందరికీ పిన్ని విశదీ

కరించి చెప్పటం గుర్తు. ఈ నేపథ్యంలో నా మొదటి జ్ఞాపకాలు. అప్పటికింకా మా కర్థంగాని ఆంధ్రాపారిస్ అనబడే తెనాలి జీవితపు దృశ్యాలే, ముమ్ముందు నేను సాహిత్య పిపాసిగా మారటానికి తోడ్పడినవనుకొంటాను.

నాన్నగారి అతి గారాబం వల్ల నైతేనేమి, అమ్మ ఏర్పరచిన కఠిన డిసిప్లిన్ కోడ్ వల్ల నైతేనేమి, నాకు పాఠశాల సంప్రదాయ విద్య అబ్బటం లేదు. ఉమ్మడి కుటుంబంలో నెలకొన్న సంస్కార వాతావరణం, సాంస్కృతిక రాజకీయ చర్చల నిత్య ఘోష-ఏ బాలకుల్ని నిస్సార విద్యాలయం చాయలకు నెట్టగలదు? అప్పుడే రెవెన్యూ డిపార్టుమెంట్ ఉద్యోగానికి తిలోదకాలిచ్చి వచ్చిన కక్కయ్య - మునిపల్లె శేషగిరిరావు వితంతు శరణాలయం కార్యదర్శి బ్రాహ్మ సమాజ సంచాలకుడు. పిన్ని ఆయనకు చేదోడు వాదోడు. రాజమండ్రి నుండి తరచుగా వచ్చి ఆయనకు సలహాలనిచ్చే కామరాజు హనుమంతరావుగారు మా నాన్నకు కజిన్. బర్మా షెల్ ఏజన్సీ, పనుల మీద తరుచు మద్రాసు వెళ్ళి వచ్చే నాన్నగారి విలక్షణమైన కబుర్లు. ఇంకో పింతండ్రి మునిపల్లె వెంకటప్పయ్యగారు, తన సహోద్యోగి-స్కూళ్ళ డిప్టీ ఇన్స్పెక్టరు చలం గారింటికి వెళ్ళినప్పుడల్లా తోడుగా ట్రిప్పులు. "ఈయన మంచి కథలు రాస్తారని" కక్కయ్య అన్నప్పుడు - ఈ మూడీ మనిషి కలం చేత బడ్తాడా - అని అమాయకంగా చలం గారిని గురించి అనుకొన్న రోజులు. దక్షిణాదిలో ఏ జైల్లోనో శిక్షననుభవిస్తూన్న పెదనాన్న గారి కొడుకు మునిపల్లె సీతారామారావుకు లాఠీ చార్జీలో పక్కటెముకలు విరిగినాయన్న ఆందోళనకర వార్తలు. ఇంకో కజిన్ మునిపల్లె రామారావు 'లా' చదువుకు కాశీ వెళ్ళి అయిదేళ్ళయినా తిరిగి రాలేదని, విప్లవకారుల్లో కలిసి కలకత్తాలో రహస్యంగా ఉంటున్నాడని సత్యాసత్యాల వార్తల మీద చర్చలు. అన్వేషణకై పోయిన నాన్నగారి మనుషులు ఏ వార్తా పంపకపోతే, నిజంగానే భయాందోళనలు. ఎంతటి కల్లోల వాతావరణంలోనైనా ఇంటికి వచ్చే వారాల పిల్లలకు అమ్మ పంచిఇచ్చే వాత్సల్య శతకాలు. జీవితంలో ధ్వని ముద్రిత మవుతూన్న ఈ అస్పష్ట శ్రుతిలయలు భవిష్యత్తులో ఆలోచనాక్రమానికి దోహదం చేసి ఉంటాయనే నా నమ్మకం.

ఇవే గాదు, ఇంకెన్నో సంకేతాలు, తీయని అనుభూతులు, విషాదానుభవాలు - మానవుణ్ణి అంతర్ముఖుడిగా మార్చ గలిగినవి. ఆ నాటివే ముమ్ముందు కథా వస్తువులు అయ్యాయి. పాఠశాల ప్రాంగణంలో పాఠాలు అబ్బక పోయినా, అవి వేరొక రూపంలో జీవితంమీద అచ్చువేస్తూనే ఉన్నవి.

ఆదిలో శబ్ద వైచిత్ర్యాలను నేర్పిన గురువు లక్ష్మిందేవమ్మగారు.

అప్పుడప్పుడు అమ్మకు వంట పనుల్లో, సంవత్సరమంతా నిలవచేసే పచ్చళ్ళ తయారీలో సాయపడటానికి మా ఇంటికి వస్తుండేది. భావవ్యక్తీకరణకు పలుకు ఎంత బలాన్నిస్తుందో ఆమె నుండే నేర్చుకోవాలి. ఆమె అకుంఠిత జీవన విశ్వాసం కొన్ని కథల్లో జ్ఞప్తికి తెచ్చుకొన్నాను.

కాని కథా స్వరూపపు మెలకువల్ని నేర్పిన గురువు-నాన్నగారి మాన్-ఫ్రైడే-రామలింగం. డ్రైవరూ, బాడీగార్డూ, గుమస్తా, మేస్త్రీ-బర్మాషెల్ ఏజన్సీని నడిపిన వాడు—ఎంత తీరికలేక పోయినా ఎలాగోలా చిన్న పెద్ద కథల్ని ఉత్సాహంగా నాకూ అన్నయ్యకూ వినిపించేవాడు కథా గమనంలో హఠాత్ నిశ్శబ్దం, ఆ తరవాత ఉత్సుకత! అతని హఠాత్ నిర్గమనంతోనే నాన్నగారు కుంగిపోయారు. మేము కుమిలిపోయాము. కాని ఆ కథల్ని విస్మరించలేదు.

ఆ నాటిదే ఇంకొక ఆర్తి - కృష్ణా పత్రికలో కథగా వచ్చింది. ఏనాడూ, ఏ దేవునికి మొక్కి ఎరగని నాన్నగారు - భగత్‌సింగు, రాజగురు, సుఖదేవుల్ని ఉరితీసిన మరుదినం — ఖిన్నులై ఉపవాసదీక్ష మూడు దినాలు పాటించిన దృశ్యం. తర్వాత వచ్చిన ఆ త్రిమూర్తుల ఫొటోకే నాన్నగారు పూలమాల వేసేవారు. విగ్రహారాధనలో ఆయనెప్పుడూ పాల్గొన్న జ్ఞాపకం లేదు. కాని విచిత్ర మేమిటంటే ఈ కథను ఏ పత్రికా వేయలేదు. కృష్ణా పత్రిక వారు ఆహ్వానించటమే గాదు. ఎవరికీ పంపని కాంప్లిమెంటరీ కాపీని ఐదురూపాయల పారితోషికాన్ని గూడా అందించారు.

యౌవనంలో మానవ చైతన్యాన్ని విస్తరింపజేసిన ప్రథమానుభూతులు, నాన్నగారి ఒడిలో కూర్చొనగా అస్పష్టంగా ముద్రవేసిన ఎన్నో కళా ప్రక్రియలు. ప్రతాపరుద్రీయం నాటకంలో యుగంధరుడి వేషం వేసి నాయన, మా ఫామిలీ డాక్టరు గోవిందరాజు సుబ్బారావు గారే నని, చాకలి పేరిగాడి పాత్రధారి మా ఇంటి పొరుగు పెద్దిభొట్ల చలపతి గారేనని - తెలుసుకొన్న తర్వాత మా అమాయిక గర్వం-తర్వాత వచ్చిన బాల కథల్లో ప్రతిఫలించింది. అట్లాగే, స్థానం నరసింహారావు గారి 'రోషనారా' నాటకం తర్వాత మహమ్మదీయులెవరో గొడవ చేశారన్న వార్త - హిందూ - ముస్లిం సమస్య క్లిష్టతను గూర్చిన నా ప్రథమ అవగాహన, హైస్కూలు విద్యార్థి దశలో "చిత్రగుప్త"లో అచ్చయిన నా మొదటి కథకు-ఇదే నేపథ్యంగా పనికివచ్చింది. ఇతి వృత్తమైతే ఈ రెండు మతాల సఖ్యత. హరిజన్ పత్రికలో గాంధీజీ వ్యాసాన్ని నాన్నగారు చదివి, విపులీకరించినప్పటి కొన్ని జ్ఞాపకాలూ కావచ్చు-ఆ కథా రచనకు బీజాలు.

తెనాలి రంగులకల జీవితానికి కాలమేఘాలు అడ్డుపడి నిర్గమించిన తదుపరి, మరొక్కసారే ఆ పట్నాన్ని చూశాను. ఆ సందర్భం-నేనెక్కడో దూరపు పరరాష్ట్రంలో ఉండగా, విన వచ్చిన 'శారద' అనే పేరుతో భూస్వామ్య-బూర్జువా సంకీర్ణ విష నాగరికతను బట్టబయలు చేసిన రచయిత-నటరాజన్ అనే హోటల్ సర్వర్ మరణ వార్త. "వాస్తవిక వాద రచనలో విశిష్ట పంథా చూపిన కీర్తిశేషుడు-శ్రీ శారద" అనే మకుటంతో రాసిన ఈ సమీక్షలో అతని తాత్విక దృష్టిని విశ్లేషించటానికి ప్రయత్నించాను. ప్రచురించినవారు-నా మిత్రులూ, ప్రముఖ న్యాయవాదీ శ్రీ చంద్రమౌళి వెంకటక్రిష్ణ తన 'శారద' మాసపత్రికలో.

నాన్నగారు కొద్ది నెలల్లో గతిస్తారనగా మా కిచ్చిన బహుమతి విలువ కట్టలేనిది. అడయారు థియోసాఫికల్ సొసైటీ గ్రంథాలయమంతా తిప్పి చూపి, వెయ్యి ఊడల మర్రి వృక్షం క్రింద ఒక అర్ధగంట కూచో బెట్టారు. అది, తంగిరాల సోమయాజులు గారి పిల్లలు, మా బాల్య మిత్రులు-వేణుతోనూ వెంకుతోనూ మేము పలుకుతున్న ప్రగల్భాలకు ఆయన చలించిపోయి. గురుకుల వాసపు నీతి పాఠం గరపటమేనని-తరువాత గ్రహించాము. మళ్ళీ, అహంతలయెత్తకుండా-ఆ తరగని విజ్ఞాన ఖనిజాన్ని ఆ విశాల వృక్ష దృశ్యాన్ని చూపిన నాన్నగారి సున్నిత విశిష్టత గూడా-నా మున్ముందు రచనల కెంతో సహకారి అయినది.

కాలపు సందు మలుపులో విష సర్పాఘాతం లాగా నాన్నగారి వ్యాపార సామ్రాజ్యం ఆర్థిక మాంద్యపు ఒత్తిడిలో, అపాత్ర-దానాల, అనాలోచితచర్యల పర్యవసానంగా ఛిన్నాభిన్నమై పోయింది.ఖనన ఖర్చులకు జేబులోడబ్బులుంచుకొని ఆయన అకస్మాత్తుగా స్వర్గస్తులైనాక-స్వగ్రామానికి తిరుగుప్రయాణం కాలంతో, దాని రంగులతో నిత్య పండుగలాంటి కళాజీవుల ఛలోక్తులతో, నిర్భీతిగా ఆడుకొన్న తెనాలి యుగం నుండి, భీతి ఒంటరితనం, ఆందోళన పెనవేసుకొన్న స్వగ్రామ జీవితం వారధి కట్టరాని సముద్రం దూరమైనా-సాహిత్యాభిరుచులకూ,రాజకీయ పరిజ్ఞానానికీ గట్టి పునాదులు ఏర్పడిన దక్కడే, మునిపల్లె వివేక వర్ధనీ ప్రాథమికోన్నత పాఠశాలలో తెలుగు మాష్టారు జమ్మలమడక రామ్మూర్తి గారు కవి పండితాభిమాని. జాషువా కవి ఖండకావ్యాల్ని ఆయన ముఖతా వినిపించినా, మాధవపెద్ది బుచ్చి సుందర రామశాస్త్రిగారు గద్గద స్వరంతో "సతీస్మృతి" పద్యాలు చదివి గుండెల్లో దిగులు రేపినా ఆయనకు పది రూపాయల చందా కోసం ఊరంతా గడప పూజలు చేసినా

పక్కనే ఉన్న చిన్న పట్నం—పొన్నూరులో చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రిగారి జైత్రయాత్ర అనర్గళ ఆశుకవితలు విన్నా అక్కడే బ్రాహ్మణ వీథిలో డాక్టరు కుటుంబరావుగారింట్లో విశ్వనాథ వారి కిన్నెరసాని పాటలు విన్నా—ఏ బాలకుడైనా తనూ కవి కావాలని కోరుకోడా?

1940 దశకంలో ఢంకా మాస పత్రికలో ప్రచురించిన సర్రియలిస్టు కవితలకూ, ఆ దశకంలోనే ప్రజాశక్తి అభ్యుదయ పత్రికల్లో విప్లవ కవిత్వానికీ-అవే ప్రేరణలు నేపథ్యాలు అయినాయి.

పుంఖాను పుంఖాలుగా వెలువడిన నా సినిమా సమీక్షలు, విశ్లేషణా వ్యాసాలు—[ఢంకా, రూపవాణి, అప్పటి ఆంధ్రప్రభ ఆదివారం సంచికల్లో-] స్వగ్రామంలో వల్లూరి వెంకట సుబ్బయ్య ఉరఫ్ మునిపల్లె సుబ్బారావు అనే నాటక సినిమారంగ నటుడి గురుత్వం ప్రాతిపదికతోనే, నటుడికీ, స్టార్‌కూ—నటనపట్ల ఎట్టి అవగాహన, ఎట్టి చైతన్యం ఉంటుంది, ఆయన సోదాహరణంగా వివరించేవారు—కొల్హాపూర్, కలకత్తాల నుండి సినిమా షూటింగులు ముగించుకొని, మా ఊళ్ళో విశ్రాంతి తీసుకొంటున్నప్పుడు కళాకారుడికి నిబద్ధత లోపిస్తే వాడు రంగూన్ రౌడీ కన్నా అధముడే—అనే ఆయన నిర్వచనం—ఎంత గొప్పది? ఆయన నిర్వచనాన్ని నేనెప్పుడూ మరచిపోలేదు.

ఆదే కాలంలో, కొత్త పట్నం స్కూలు విప్లవవాదుల కేసునుంచి విడుదలై వచ్చిన మా కజిన్ రామారావు, ఊపిరి సలపని అలజడులతో ఆ మార్గంలోకి అభిముఖుణ్ణి చేస్తున్నాడు.

అగ్రజులిద్దరూ నేను నవలలు చదవకుండా, చాలా కట్టుదిట్టం చేసేవారు. "అవి ముందు ముందు చదవొచ్చు. చరిత్రను అర్థం చేసుకో'—అనేవారు. వాళ్ళ ప్రోద్బలంతోనే అప్పటికి లభిస్తున్న దేశ దేశాల చరిత్రల తెలుగు పుస్తకాలు చాలా చదివి ఉంటాను. "ప్రజాబంధు, ప్రజా మిత్ర"ల్లో రాజకీయ వ్యాసాలు చాలా ఆసక్తిగా ఉండేవి. దాదాపు ఆ రోజుల్లోనే ప్రతాప రామ సుబ్బయ్యగారి "హిట్లరు దురంతాల్ని" డజను సార్లయినా ఆమూలాగ్రంగా పఠించి ఉంటాను. లెనిన్ ప్రవచించిన సామ్రాజ్య వాదపు చివరి ఆయుధం—ఫాసిజం—తాండవ మాడుతోన్నది. అబిసీనియాలో, స్పెయిన్‌లో, జెకొస్లవేకియా, ఆస్ట్రియాలు దాని కబంధ హస్తాల కౌగిలిలో నుగ్గుకానున్న రోజులు. ఆ సమస్యల మీద తెలుగు, ఇంగ్లీషు బాషల్లో కాంపోజిషన్లు వ్రాసి అన్నయ్యలకు చూపించవలసిన నిబంధన ఉన్న దినాలవి.

అందులో—ఒక ఇంగ్లీషు కాంపోజిషన్ చదివి, నను రచయితవు కమ్మని ఆశీర్వదించింది—అప్పటిప్రముఖ కమ్యూనిష్టు నేత సోలీ బాట్లీవాలా—అనే పార్శీ పెద్దమనిషి. అప్పట్లో ఆయన మా రామారావుతో కలిసి మాజిల్లాలో పర్యటిస్తున్నాడు. మా ఊరు వచ్చిన రోజున మధ్యాహ్నం భోజనాలయ్యాక అరుగు మీద విశ్రాంతి తీసుకుంటూ నా కాంపోజిషన్ పుస్తకం పరిశీలిస్తూ—"కామ్రెడ్ రాంరావ్-యువర్ కజిన్ విల్ బి ఎ రైటర్. సీ హి రీడ్స్ కరెక్ట్ లిటరేచర్."- అని ఆశీర్వదించాడు.

నే నెంతవరకు ఆ మహావక్త అంచనాలకు ఎదగగలిగానో ఇప్పటికీ అనుమానమైనా, పాతిక, ముప్పై ఏళ్ళ తరువాత తను రాజకీయ సన్యాసంలో ఉండగా, బొంబాయికి వెళ్ళి పలకరించాను.

నేను తిరిగి వస్తుంటే - "ఇటీజ్ ఎ పిటీ యు ఆర్ రైటింగ్ ఓన్లీ ఫిక్షన్. ఐ థాట్ యు వుడ్ వర్ర్యూ పొలిటికల్ ఎకనామిక్స్" అన్నాడు. బాట్లీవాలా అసాధారణ నిజాయితీ గల రాజకీయవేత్త. పార్టీ నుంచి వైదొలగిన తర్వాత, వేల వేల అమెరికన్ డాలర్ల ఆశ చూపినా, వామపక్ష ఉద్యమాన్ని మలినం పట్టించే రాతలు రాయలేదు.

కాని, ఆనాటి రాజకీయ సాహిత్యం విరివిగా చదివిన ఫలితంగానే - నక్సలైట్ ఉద్యమం తలెత్తబోతున్నదని అయిదారేళ్ళ ముందుగానే-'అరణ్యంలో మానవ యంత్రం' కథలో ఉద్ఘాటించ గలిగా ననుకొంటాను. ఫజలాలీ కమిషన్‌కు ముందే విశాలాంధ్ర అవతరించటం చారిత్రక అనివార్యం అని 'వీర కుంకుమ' కథలో సూచించగలిగాననుకొంటాను. కాని చైనా మన దేశం మీద అత్యాచారం జరపడం తథ్యం అని 1950 దశకంలో రాసిన కథను (రాతి బొమ్మ, మూగ మనిషి, చైనా వాడు) ఆనాటి ప్రముఖ సాహిత్య పత్రిక వేయలేదు. ఆ కథ పోయింది. అప్పటికీ, ఇప్పటికీ నేను రాయగలిగిన కొద్ది పాటి కథల్లో అత్యుత్తమమైనదని నా అంచనా. ఆదశకంలో ఇంతటి ఉధృతంలో లేని భారతీయ ప్రాచీన శిల్పసంపద అపహరణ, విదేశాలకు చేరవేతల గురించిన భవిష్యత్ చిత్రణ ఉందా కథలో. దాని ప్రచురణను నిరాకరించటానికి కారణాలు సాహిత్య సంబంధమైనవి కావని తర్వాత కొన్ని సంవత్సరాలకు తెలిసింది.

అట్లాంటిదే మరొక అనుభవం. ఆదశకం ప్రారంభంలో రాయలసీమంతా పర్యటించి- కరువూ, చేనేత పనివారి దుస్థితీ, ఆకళింపు చేసుకొని రాసిన

నవలిక ఆంధ్ర వార పత్రికలో "పేరులూ—వారసులూ" శీర్షిక కింద ప్రచురణ అయింది.

నాకు మంచి నవలా సాహిత్యాన్ని పరిచయం చేసింది నా హైస్కూలు విద్యార్థి దశలో, దామా సుబ్బారావూ, లోకనాథం అనే మాస్టారూ. వయసులో నాకంటే చాలా పెద్ద వాళ్ళు. అయినా, అప్పటి వినోదిని, చిత్రగుప్త, ఢంకా పత్రికల్లో నా రచనలు చదివి - తమతో సమానంగా చూచిన సహృదయులు వీరిద్దరూ.

దామా కోటేశ్వరరావుగారి కథ "పిచ్చికోటి"ని గురించి అతి విపులంగా చర్చించి, విశ్లేషించి,చెప్పిన దామా సుబ్బారావుకూడా యౌవనంలోనే గతించాడు. లోకనాథంగారు - డొస్టావిస్కీ—నవల - క్రైం అండ్ పనిష్మెంటును మొదట చదివించారు. అర్థం తెలియని చోట విశదీకరించేవారు. వారి పరిచయపు రోజుల్లోనే రెండవ ప్రపంచయుద్ధం ప్రారంభమైంది. శ్రీశ్రీ రష్యా గీతం రాయకముందే - రష్యా విజయం తథ్యం - అని దామా సుబ్బారావు గేయం ఆలపించాడు. ఏ కలం పేరుతోనో ప్రచురించిన ఆ కాపీకోసం తర్వాత ఎంత గాలించినా, నా కథలాగానే మాయమైంది. హైస్కూల్లో మా తెలుగు మాస్టారులు కొత్త సత్యనారాయణచౌదరి, తుమ్మల సీతారామమూర్తిచౌదరి, ఏటుకూరి నర్సయ్యగార్లు, ఏటుకూరివారి ఛలోక్తులు ఇప్పటికీ జ్ఞాపకమున్నాయి.

క్విట్ ఇండియా ఉద్యమంతోనే నా చదువుకు చరమగీతం, ప్రవాస జీవితానికి నాందీగీతం. తెలుగుమాట, తెలుగు సాహిత్యం - వినబడని కన బడని దూరప్రాంతాల్లో ఉన్నా మాతృభూమిని విస్మరించకుండా, నాకు కరుణ పంచి ఇచ్చిన పాత్రలను సంస్మరించుకుంటూ కొన్ని కథలు రాశాను. బాల్య స్మృతులు, యౌవనానుభవాలు - రచయితకు, పాడికుండలు గదా! లక్కిరెడ్డి పల్లిలో విషం గింజలు నూరుకొని తాగి, ఆత్మహత్య చేసుకొన్న చేనేత కార్మికుడు ఓబయ్య, నేను వస్తున్నప్పుడు "మడితో" అన్నం వండి తినిపించిన డ్రైవరు వెంకటస్వామి భార్యా, ఒక రోజు నీళ్ళు తోడి పోసినందుకు డబ్బు తీసుకోకుండా భోజనం పెట్టిన పూటకూళ్ళ తల్లి మండాది రంగమ్మా గాలి వానలో నన్నూ తమ్ముణ్ణి మొదట రక్షించి, తర్వాత తన కొడుకును బయట కీడ్చిన మా పెత్తల్లి కాకుమాను ఎంకచ్చమ్మా, ఉబ్బసంపోటు ముంచుకువస్తుందని తెలిసినా, నే నిచ్చిన నారింజ తొన తిని నా సంతోషానికి నెలల తరబడి చిరునవ్వుతో బాధ ననుభవించిన కరుణామూర్తి. మా కనకమ్మ ఆమ్మా, నీతి నిజాయితీలకి జీవితంలో ఎంత విలువ ఉన్నదో ఉగ్గుపాలనుండి నూరిపోసిన

నా మాతృమూర్తి శారదాంబా, ఒక భూస్వామ్య అహంకార మంత్రి పుంగవుడి అవమానం భరించలేక బావిలో దూకి ఆత్మహత్య చేసుకొన్న రాజకీయ బాధితుడూ, త్యాగ నిరతుడూ, సత్తెనపల్లి కందికట్ల సూర్యనారాయణ - ఇత్యాదులు ఏదో రూపంలో నా కథల్లో నిలిచిపోయారు. ఏ ప్రాంతంలో నివసించినా, అక్కడి సామాన్య ప్రజల అవ్యాజ కరుణ మానవతా దృక్పథం - కథల్లో ప్రతిఫలించకపోతే "నేనూ రచయితనే" అని అనుకోగలనా? పగతో రాయలేదు. పగకు మౌలిక అంకురం గురించే రాయ ప్రయత్నించాను. ఆ మౌలిక సమస్యకు వ్యవస్థా రూపంలోనే బీజం ఉన్నదని గ్రహించానేమో, ఈ భూస్వామ్య ధనికవాద వ్యవస్థను వ్యతిరేకిస్తూ రాయ ప్రయత్నించాను.

నిక్కర్లు తొడిగే రోజుల్లోనూ, పైజమాలకు ఎగబాకిన వయస్సులోనూ- నన్ను ప్రోత్సహించిన ఆనాటి చిత్రగుప్త, వినోదిని, ఢంకా, రూపవాణి, కథాంజలి, పెంకిపిల్ల - ఇత్యాది పత్రికా సంపాదకులు, ప్రతిఫలం రచయితలకు ఇవ్వలేని కాలంలో, కార్డు ముక్కల్లో పంచి ఇచ్చిన ఆశీర్వచనాల్ని ఎట్లా మరచిపోగలను? అట్లాగే నా ప్రాథమిక సాహితీ మిత్రులు - విశాఖలో ఘండికోట బ్రహ్మాజీరావు, హ్యూమన్ డైనమో మనూనా, నేతేటి వాయునందనశర్మ, నా సహోద్యోగి యస్. ఎస్. మూర్తి అప్పటికింకా సైడ్ వింగ్స్ నుంచి లోకాన్ని తీవ్రంగా పరిశీలిస్తున్న కాశీపట్నం మాస్టారు - అసూయాద్వేషాలు పొలకరించని ఆ రోజుల్లో, నన్నొక గ్లామర్ బాయ్‌గా పరిగణించి ఇచ్చిన గౌరవాన్ని వాత్సల్యాన్ని ఎట్లా విస్మరించగలను? ఈ యుగపు ప్రధాన సాహిత్య ప్రక్రియ అయిన "కథానిక"కు ఎనలేని ప్రచారాన్ని కూర్చుతున్న ఉత్తమ విమర్శకులు - మధురాంతకం రాజారాంగారి ప్రోత్సాహాన్ని మరువలేను. అప్రయత్నంగా జొరబడ్డ స్వోత్కర్ష ఉన్నా నా అనుభవాలనుంచి కొత్తవారు కూడా మంచిని గ్రహించగలిగితే, అంతకన్నా మహదానందం ఏముంటుంది? ●

(ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక—22.7.87)